క్లుప్తంగా

సుదర్శన్ రెడ్డిపై ఆరోపణలు సరికాదు

బోధన్‌టౌన్(బోధన్): మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులపై చేస్తున్న ఆరోపణలు సరికాదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి అన్నారు. ఇక ముందు కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఇష్టారాజ్యంగా అనుచిత వాఖ్యలు చేయడం సరికాదన్నారు. నాయకులు బడు, విష్ణువర్ధన్ రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

ముగిసిన బీవీఎస్ శిబిరం

బోధన్‌టౌన్(బోధన్): ఆచన్‌పల్లి సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన వెకేషన్ బైబిల్ స్కూల్ శిబిరం శుక్రవారంతో ముగిసింది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరంలో పాఠశాల స్థాయి పిల్లలకు నైతిక విలువలతో పాటు ఇతర సామాజిక అంశాలను పాస్టర్ ప్రభాకర్ వివరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, పాల్గొన్న పిల్లలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. దేవిదాస్, జ్యోతిరాజ్, ఎడ్వర్డ్ ముల్లర్, కిశోర్,తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



నందిపేట్(ఆర్మూర్): ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఫలితాలలో రాష్ట్రర్యాంకు సాధించిన వెల్మల్ గ్రామానికి చెందిన దారం రసజ్ఞను శుక్రవారం పీయూసీ చైర్మన్ ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అభినందించి సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. అనంతరం వెల్మల్ బైపాస్ రోడ్డు పనులను, నందిపేటలోని కురుమ సంఘం ఫంక్షన్ హాల్ పనులను పరిశీలించారు.

బాధితులకు బియ్యం పంపిణీ



భీమ్‌గల్: కారేపల్లిలో మూడు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు బాదావత్ శుక్రు, మూడవత్ సుధీర్‌ల ఇళ్లు ధ్వంసమై ఇంటిలో ఉన్న బియ్యం తడిసిపోయాయి. ఈ రెండు కుటుంబాలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి రెండు క్వింటాళ్ల బియ్యాన్ని పంపించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరి స్వామి తెలిపారు. ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, పట్టణ అధ్యక్షుడు జీజే నర్సయ్య, పాల్గొన్నారు.

సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలి



ఖలీల్ వాడి: నిజామాబాద్ జిల్లా సారంగపూర్‌లోని షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని, లేకుంటే రైతులకు అప్పగించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నేతలు అన్నారు. శుక్రవారం నగరంలోని అర్సపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. జిల్లాలోని చక్కెర ఫ్యాక్టరీలు మూతపడి 15 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ ఫ్యాక్టరీల మీద ఆధారపడిన కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో తెరిపిస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి 9 సంవత్సరాలు దాటినా ఈనాటికి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈమధ్య కాలంలో మంత్రి కేటీఆర్ బోధన్ ఫ్యాక్టరీని రైతులు నడుపుకోగలిగితే సహకార రంగంలో అప్పజెప్పే దానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారని గుర్తు చేశారు. బోధన్, సారంగపూర్ ఫ్యాక్టరీలను ప్రభుత్వమే నడిపించి కార్మికులకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు.

బ్రిజ్ భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్: భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా కొనసాగుతున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నేత, అథ్లెటిక్స్ కోచ్ సయ్యద్ కైజర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద ప్రజాసంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని నిరసన ప్రదర్శనలు చేస్తున్నారని, అయినా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎంపీగా అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆవిరవుతున్న పచ్చదనం

- భీమ్‌గల్ మున్సిపాలిటీలో నాటిన మొక్కలు పర్యవేక్షణ లేక ఎండిపోతున్న వైనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మొక్కలు నాటడంతోనే సరిపోదు. అవి ఏపుగా పెరగడానికి తగిన నీటి సౌకర్యం కల్పించాలి. సంరక్షణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా ఉంటుంది. తూతూ మంత్రంగా నాటేశాం.. అవే పెరుగుతాయి అనుకుంటే ఏం జరుగుతుందో భీమ్‌గల్ పట్టణంలోని రహదారుల మధ్య డివైడర్లలో నాటిన మొక్కలే చెబుతాయి. మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు గాలికి వదిలేయడంతో ఎండిపోతున్నాయి.



మొక్కలు ఎండిపోవడంతో బోసిపోయిన డివైడర్లు

భీమ్‌గల్: పురపాలక సంఘాల్లో పచ్చదనం పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నా భీమ్‌గల్ పట్టణంలో మాత్రం ఆ మేరకు పచ్చదనం కానరావడం లేదు. మొక్కలు నాటాక వాటి సంరక్షణపై దృష్టి పెడితే ప్రయోజనం ఉండేది. ఇందుకు విరుద్ధంగా అధికారులు పట్టించుకోక పోవడంతో డివైడర్లపై నాటిన మొక్కలు చనిపోతున్నాయి. పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి బడా భీమ్‌గల్ వైపు, బాబాపూర్ రోడ్డు వైపు దారి పొడవునా డివైడర్లు ఉన్నాయి. వీటి మధ్యలో మొక్కలు నాటారు. మొదట్లో అవి ప్రత్యేక ఆకర్షణగా కనిపించాయి. రహదారికి కొత్త అందాన్ని తెచ్చాయి. ఇంత వరకు బాగానే ఉంది. కాని మున్సిపాల్ అధికారుల నిర్లక్ష్యంతో మొక్కలు ఎండిపోతున్నాయి.

పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న డివైడర్లు

పూల మొక్కలు, పచ్చని గడ్డితో సర్వాంగ సుందరంగా ఉండాల్సిన డివైడర్లలో మొక్కల మధ్య ఖాళీ స్థలంలో మట్టిని నింపి వదిలేయడంతో, కొన్ని చోట్ల మొక్కలు ఎండిపోవడంతో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. బోసి పోతున్న డివైడర్లపై పచ్చదనం పెంపొందించడానికి మొక్కలు నాటడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. పట్టణానికి కొత్త పచ్చని శోభ తెచ్చేల పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మొక్కలు నాటిన తరువాత పశువులు తినకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మరో వైపు డివైడర్లపై చెత్త లేకుండా మున్సిపాల్ సిబ్బంది పర్యవేక్షించాలి. సకాలంలో మొక్కలకు నీరు అందిస్తే అనతి కాలంలోనే పచ్చదనం సంతరించుకుంటుందని పట్టణ ప్రజలు చెబుతున్నారు.



బాబాపూర్ మార్గంలో డివైడర్లపై పెరుగుతున్న పిచ్చి మొక్కలు



బడా భీమ్‌గల్ మార్గంలో..

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



ఆలూర్ తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు



నందిపేట తహసీల్ కార్యాలయం ఎదుట..

సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల్లో వీఆర్ఏలు శుక్రవారం తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. పేస్కేల్‌తో పాటు అర్హత కలిగిన వారికి పదోన్నతులు ఇస్తామని కేసీఆర్ చెప్పారని, అలాగే 55 సంవత్సరాలు దాటిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. కానీ, ఇంత వరకు అమలు చేయలేకపోవడం సరికాదన్నారు. హామీని నిలబెట్టుకోని పక్షంలో మళ్లీ సమ్మెకు దిగుతామని వీఆర్ఏలు హెచ్చరించారు. – సాక్షి నెట్‌వర్క్



రెంజల్ తహసీల్ కార్యాలయం ఎదుట..



డొంకేశ్వర్‌లో ధర్నా చేస్తున్న వీఆర్ఏలు



మాక్లూర్‌లో తహసీల్దార్‌కు వినతి పత్రం ..



నవీపేటలో ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌లో రూ.6.43 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే కమ్మర్‌పల్లి, తడపాకల్ బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బద్దం పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో..

మోర్తాడ్: ఏర్గట్ల మండలంలోని తొర్తి, తాళ్లరాంపూర్, తడపాకల్‌లలో అభివృద్ధి పనులకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. తొర్తిలో వంతెన పనులు, తాళ్లరాంపూర్, తడపాకల్‌లో బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, జెడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్ పాల్గొన్నారు.



ఉప్లూర్‌లో శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో..

వేల్పూర్: మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన ధ్వజస్తంభం, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి శుక్రవారం రూ.15 లక్షల నిధులు మంజూరు చేశారు. గ్రామంలో నిర్మిస్తున్న కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం నిధులు మంజూరు చేస్తూ వీడీసీ వారికి ప్రొసీడింగ్ కాపీని ఎమ్మెల్యే అందజేశారు. అలాగే ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆలూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బేగరి రాజు కుటుంబానికి పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ క్లోం మోహన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ క్లోం భోజా రెడ్డి పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 145వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు హన్మంతరావు, శంకర్‌లు కూర్చున్నారు. ఈ ప్రాంత ప్రజలు ప్రత్యేక జిల్లా కావాలనే ఆకాంక్షను ప్రభుత్వం గౌరవించాలని న్యాయవాదులు అన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

డిచ్‌పల్లి: నడిపల్లిలో నిర్మించిన ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కులాచారి సతీష్‌రావు, అశ్విని దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. హంపి విరూపాక్ష విద్యారణ్యభారతి స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. వైస్ ఎంపీపీ కులాచారి శ్యాంరావు, వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం..

14న అమృతలత అపురూప అవార్డులు

మాక్లూర్: అమృతలత అపురూప అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమం ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ ఆడిటోరియం(పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో) సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతుందని ప్రోగ్రాం కన్వీనర్ నెల్లుట్ల రమాదేవి శుక్రవారం తెలిపారు. అమృతలత జీవన సాఫల్య పురస్కారాలకుగాను నవల రచన విభాగంలో గంటి భానుమతి, విద్యారంగంలో డాక్టర్ పి విజయలక్ష్మి పండిట్, సినీరంగ సంగీత శాస్త్రీయంలో ద్వారం లక్ష్మిలు అవార్డులు అందుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి కన్వీనర్ డాక్టర్ మృణాళిని విశిష్ట అతిథిగా హాజరై బహుమతులను ప్రధానం చేస్తారని వెల్లడించారు.

15 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

వర్ని/రుద్రూర్/రెంజల్/బోధన్ రూరల్ : ఈ నెల 15 నుంచి 17 వరకు వర్ని, రుద్రూర్, చందూర్, రెంజల్ మండల కేంద్రాల్లో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి వెల్లడించారు. క్రీడల్లో 18 నుంచి 36 ఏళ్ల యువతీ యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ నెల 14 లోపు గ్రామ పంచాయతీల్లో పేర్లు నమోదు చేసుకుని దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. క్రీడల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు.

22న ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన

మాక్లూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పునఃనిర్మాణం జరిగిన ఆలయంలో ఈ నెల 22న విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని రామాలయ పూజారి ఈరమొల్లా లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన పురాతన ఆలయాన్ని కూల్చివేసి నూతన ఆలయాన్ని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా నిర్మించారు. గ్రామస్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న ఐకేపీ వీవోఏల సమ్మె

సాక్షి నెట్‌వర్క్ : న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చేపట్టి సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం సమ్మె 19వ రోజుకు చేరుకుంది. కనీస వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. సమ్మె ప్రారంభించి మూడు వారాలు అవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.



మాక్లూర్: మద్దతు తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నేతలు



వర్నిలో సమ్మె చేస్తున్న వీవోఏలు



మోస్రాలో మద్దతు తెలుపుతున్న దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షురాలు కవిత



రెంజల్‌లో..



ఆర్మూర్‌టౌన్: అంబేడ్కర్ చౌరస్తా వద్ద..

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్ కుమార్



మాట్లాడుతున్న ఎస్సై యాదగిరిగౌడ్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ సబ్‌డివిజన్ పరిధిలోని ప్రతీ ఒక్క ఆటోడ్రైవర్ తమ వివరాలను స్థానిక ఎస్సైకి తెలియజేయాలని, పూర్తి వివరాలతో గల మై ఆటోఈజ్ సేఫ్ అనే స్టిక్కర్ ఆటోలో ఏర్పాటు చేయాలని ఏసీపీ కిరణ్ కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్‌లకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఏసీపీ కిరణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. నిబంధనలు పాటించాలని, ఓవర్‌లోడ్‌తో ప్రయాణం ప్రమాదకరమన్నారు. ఆటో డ్రైవర్ వద్ద లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్‌తో పాటు సంబంధిత పత్రాలు కచ్చితంగా ఉండాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని వివరించారు. ఎంవీఐ అశ్వక్, పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, ఎస్సైలు పీటర్, నవీన్, సందీప్, రవీందర్, పాండేరావ్, తదితరులు ఉన్నారు.

లైసెన్సు ఉన్నవారే ఆటోలు నడపాలి

మాక్లూర్: డ్రైవింగ్ లైసెన్సు ఉన్నవారే ఆటోలు నడపాలని ఎస్సై యాదగిరి గౌడ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ వద్ద మై ఆటో మై సేఫ్ కార్యక్రమం నిర్వహించి, ప్రయాణికులను తరలించే ఆటో యజమానులకు సూచనలు చేశారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా నిబంధలను అతిక్రమించి ప్రయాణికులను ఎక్కించి ఆటోలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని ఆటోల సంఖ్య ఎంత ఏ రూట్లలో ఆటోలు తిరుగుతున్నాయనే సమాచారం తీసుకున్నారు.





దళితరత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

బోధన్/రుద్రూర్: పట్టణంలోని శక్కర్‌నగర్‌కు చెందిన సామాజిక సేవకుడు కారం స్వామి, రుద్రూర్ మండలం రాణంపల్లి గ్రామానికి చెందిన నీరడి సవితలకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ జయంతి రోజు దళిత రత్న అవార్డును ప్రధానం చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం శక్కర్ నగర్ హరిజన సుధార్ సమితి ఆధ్వర్యంలో, మాలమహానాడు ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డు గ్రహీతలను వేర్వేరుగా సన్మానించారు.

తూకం వేయరు.. లారీలు రావు

- రోజుల తరబడి కల్లాల్లోనే ఉంటున్న ధాన్యం
- తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్న నిర్వాహకులు
- డొంకేశ్వర్ మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ఇదీ పరిస్థితి



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండల పరిధిలో గల కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తేమ శాతం పేరుతో నిర్వాహకులు వడ్లను తూకం వేయడం లేదు. తద్వారా రోజుల తరబడి కల్లాల్లోనే ధాన్యం ఉంటోంది. తేమ శాతం వచ్చేదాకా రైతులు ఎండలోనే శ్రమిస్తున్నారు. కాగా, తూకం వేసిన బస్తాలు కేంద్రాల నుంచి కదలడం లేదు. కొన్ని రోజులుగా లారీలు సక్రమంగా రావడం లేదు. దీంతో రైతులు మండుటెండలో కల్లాల వద్దే కావలి ఉంటున్నారు. మండల పరిధిలో రెండు సొసైటీలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొన్నటి వరకు కురిసిన అకాల వర్షాలకు నిత్యం వడ్లు తడిసిపోయాయి. ప్రస్తుతం ఎండలు ముదిరినా కూడా ధాన్యం ఎండలేదని, తేమ శాతం ఎక్కువ ఉందని తూకం వేయడం లేదు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లోనైతే నెల రోజుల పాటు ధాన్యాన్ని ఉంచిన రైతులున్నారు. తూకం వేయాలని నిర్వాహకులపై ఒత్తిడి తీసుకువస్తే, వేసిన తర్వాత మిల్లర్లు తీసుకోకపోతే మాకు సంబంధం లేదని చేతులెత్తేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన తహసీల్దార్

మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న లారీల సమస్యను స్థానిక తహసీల్దార్ రవీందర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డొంకేశ్వర్, సిర్పూర్, గాదెపల్లి, నికాల్‌పూర్, నూత్‌పల్లి, కోమట్‌పల్లి కేంద్రాల్లో సమస్య తీవ్రంగా ఉందని, తూకం వేసిన బస్తాలు వెంటనే మిల్లులకు తరలించాలని కోరారు. దాదాపు 30 లారీలు ఉన్నపలంగా కావాలన్నారు. లారీలు రాకపోవడంతో ధాన్యం తూకం వేయలేకపోతున్నారని వివరించారు. అయినప్పటికీ శుక్రవారం ఒక్కలారీ కూడా మండలానికి రాలేదు.

నెల రోజులవుతోంది



నెల రోజులుగా ఏడు ట్రాక్టర్ల వడ్లు కల్లాల్లోనే ఎండుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొద్దిగా తడిసి తేమ వచ్చింది. ఎంత ఆరబెట్టినా కిందికి ఉన్న వడ్లు కొంత పచ్చిగా ఉంటున్నాయి. తేమశాతం ఎక్కువ ఉందని చెప్పి వడ్లు తూకం వేయడం లేదు. 90 శాతం ఎండినా కూడా కొనడం లేదు. రైతులను చాలా ఇబ్బంది పెడుతున్నరు.

– రాకేశ్, యువరైతు, తొండాకూర్

ఘనంగా నర్సింగ్ డే వేడుకలు



పట్టణ ఆస్పత్రిలో నర్సింగ్ డే వేడుకల్లో పాల్గొన్న నర్సులు, వైద్యులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రిల్లో అంతర్జాతీయ నర్సింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ వంద పడకల ఆస్పత్రిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ అమృత్‌రాంరెడ్డి, డెర్మటాలజిస్ట్ వెంకటరమణ, పిల్లల వైద్యుడు అజయ్, స్త్రీవైద్య నిపుణురాలు గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.